పార్కింగ్ పరేషాన్



రోడ్డుపై వాహనాలు నిలిపేయడంతో 108 వాహనం అతి కష్టంపై కేజీహెచ్ లోపలికి వెళ్తున్న దృశ్యం

- కేజీహెచ్ ఓపీ గేట్ వద్ద ద్విచక్ర వాహన చోదకుల పరిస్థితి దారుణం
- పార్కింగ్ లేక అవస్థలు

పేదల సంజీవని కేజీహెచ్ ఓపీకి వాహనాలపై వెళ్లే రోగులు, వారి సహాయకులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ఆ పరిసరాల్లోకి వాహనాలకు అనుమతి లేకపోవడంతో బయటే వాటిని నిలుపుకోవాల్సి వస్తోంది. అలాగని బయట ఎక్కడైనా తమ వాహనాలు నిలుపుకుంటే పోలీసులు వాహనాల ఫొటోలు తీయడం.. చలానాలు రాయడం చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా కేజీహెచ్ ఓపీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుంది. రద్దీ కూడా అప్పుడే ఎక్కువగా ఉంటుంది. అయినప్పటికీ ఆ తర్వాత కూడా రోగులు, వారి సహాయకుల వాహనాలను అనుమతించకపోవడం సరి కాదని పలువురు పేర్కొంటున్నారు.



కేజీహెచ్ ఓపీలోకి అనుమతించకుండా ఏర్పాటు చేసిన స్టాపర్లు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ నిత్యం పేషెంట్లు.. వారి సహాయకులతో కిటకిటలాడుతుంటుంది. విశాఖ నగరం నుంచే కాక ఒడిశా, చత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాల నుంచి కూడా వైద్యం కోసం రోగులు ఇక్కడికే వస్తుంటారు. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు సంజీవనిలా కేజీహెచ్ నిలుస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు కేజీహెచ్ నలుమూలల ఉండే గదుల్లో ఉంటున్నారు. దీంతో ఈ చుట్టుపక్కల ప్రాంతాలు ఎప్పుడు చూసినా రద్దీగా ఉంటూ ఓపీకి వచ్చే నగరవాసులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వచ్చే పేషెంట్లు వారి వాహనాలు నిలిపేందుకు లోపలికి అనుమతి ఇవ్వకపోవడంతో నడి రోడ్డుపైనే వాటిని నిలపాల్సి వస్తోంది. ఫలితంగా ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై పార్కింగ్ చేసే వాహనాల ఫొటోలు తీసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. పోనీ వార్డుబాయిలేన్‌కు ఆనుకుని ఉన్న కేజీహెచ్ ప్రహరీ వద్ద పార్కింగ్ చేద్దామనుకుంటే స్థానికులు పార్కింగ్ చేయనివ్వడం లేదని వాహన చోదకులు సాక్షి దృష్టికి తీసుకొచ్చారు. కేజీహెచ్ ఓపీ గేట్ లోపలికి ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు అనుమతి ఇవ్వకపోవడంతో మెయిన్‌రోడ్డుపైనే అన్ని వాహనాలను నిలుపుతున్నారు. ఫలితంగా ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. అలాగే కేజీహెచ్ పరిసర ప్రాంతాలు కూడా ట్రాఫిక్‌తో కిటకిటలాడుతున్నాయి. అంతే కాక 108 వాహనం, అంబులెన్స్‌ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.



వాహనాలను అనుమతించకపోవడంతో రద్దీగా మారిన వార్డుబాయ్ లేన్ రోడ్డు

ఉదయం నుంచి రద్దీ..

ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఓపీ విభాగం ఆ సమయంలోనే నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి రద్దీ తగ్గినప్పటికీ ఓపీలోకి ఎటువంటి వాహనాలను అనుమతించకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్‌కు దారి చూపకపోతే.. కేజీహెచ్‌కు వచ్చే పేషెంట్లు, వారి సహాయకులు వాహనాలు ఎక్కడ నిలుపుకోవాలో తెలియడం లేదని, పోనీ రోడ్డుపై ఒక వైపు వాహనాలు పెట్టుకుంటే పోలీసులు చలానాలు అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న శ్రావణలక్ష్మి పూజలు



విశేష అలంకరణలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఏవోగా మంగరాజు



మంగరాజును అభినందిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తదితరులు

మహారాణిపేట: కేజీహెచ్ ఏవోగా ఎస్.మంగరాజు నియమితులయ్యారు. బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నగరంలో ప్రభుత్వ మానసిక వైద్యశాలలో ఆఫీసు సూపరింటెండెంట్‌గా, గతంలో కేజీహెచ్ సీనియర్ అసిస్టెంట్‌గా మంగరాజు విధులు నిర్వర్తించారు. ఆయన పదోన్నతిపై కేజీహెచ్ ఏవోగా నియమితులయ్యారు. ఆయనను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, మేనేజర్ సీఎం జవహర్‌లాల్, సీనియర్ అసిస్టెంట్లు బాలకృష్ణ, నూకరాజు, ప్రకాష్, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు అభినందించారు.

వినాయక చవితి పూజలకు పందిరి రాట



పందిరి రాట వేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార: దొండపర్తిలో రానున్న వినాయ చవితి వేడుకల కోసం భారీ గణనాథుని విగ్రహం నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గణపతిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరయ్యారు. అర్చకుడు సుబ్రహ్మణ్యం పూజలు నిర్వహించి పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో జాన్‌వెస్లీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు

మురళీనగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మాధవధార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌పీ నాయుడు పర్యవేక్షణలో విద్యార్థులకు 'మన స్వాతంత్ర్యం.. సమరయోధుల త్యాగఫలం' అనే అంశంపై 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఉదయం 10.30 గంటలకు వ్యాస రచన పోటీలు, అనంతరం 1, 2, 3 తరగతుల చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



చిలకపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

డాబాగార్డెన్స్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమంటూ 39వ వార్డు కేజేపేట సెక్టార్ పరిధి చిలకపేట, లక్ష్మీదేవిపేట, బీవీ టెంపుల్ తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను చాటేలా ముగ్గుల పోటీలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలు చేసే కార్యక్రమాల గురించి కేంద్రాల కార్యకర్తలకు వివరించారు. తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గర్భం దాల్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల వద్ద వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భవానీ, సత్యవతి, సునీత, ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శి రూప, ఏఎన్ఎం ప్రభావతి, ఆశ కార్యకర్త ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అయ్యో సత్యదేవా!



ఓ మూల పడేసిన సత్యదేవుని రాతి విగ్రహం

డాబాగార్డెన్స్: హిందువులు ఆరాధ్య దైవంగా భావించే సత్యదేవుని విగ్రహం పూజలకు నోచుకోకుండా ఒక పక్కన పడేశారంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాబాగార్డెన్స్ (రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపాన) శారదా స్ట్రీట్‌లోని ఒక కళాశాల ఆవరణలో స్వామి వారి విగ్రహం పడి ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఆ విగ్రహాన్ని నెలకొల్పి పూజలకు అవకాశం కల్పించాలని కోరారు.

మెరుగైన సిలబస్‌తో విద్యార్థుల ఉన్నతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

అల్లిపురం: స్వయం ప్రతిపత్తి పొందిన విశాఖ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల అభివృద్ధికి అనుగుణంగా సిలబస్ రూపొందించాలని పలువురు ఆచార్యులు అభిప్రాయపడ్డారు. కళాశాల స్వయం ప్రతిపత్తి పొందిన సందర్భంగా బోర్డు ఆఫ్ స్టడీస్ మొదటి సమావేశం బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల నాణ్యతా ప్రమాణాలను పెంచే దిశగా స్వయం ప్రతిపత్తి ఉపయోగపడుతుందన్నారు. జీవనోపాధికి అవకాశం కలిగే విధంగా సిలబస్ రూపొందించేందుకు తగిన సలహాలు, సూచనలు అందించాలని ఆమె కోరారు. ఏయూ భౌతికశాస్త్ర ఆచార్యులు కె.సమత, మైక్రో బయాలజీ ఆచార్యులు డాక్టర్ వి.లక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ పీఎల్ శరణ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ డి.అరుణపద్మ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఆర్. కిరణ్మయి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో చేనేత దినోత్సవం



చేనేత ప్రదర్శనలో విద్యార్థినులు, అధ్యాపకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బుధవారం హోంసైన్స్ విభాగం ఆధ్వర్యంలో చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రూపొందించిన చేనేత వస్త్రాల పట్ల అందరికీ అవగాహన కలిగేలా డాక్యుమెంటరీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. పోచంపల్లి, గద్వాల్, మంగళగిరి, గుంటూరు, వెంకటగిరి, కంచి, నారాయణపేట చేనేత వస్త్రాలను విద్యార్థినులు ధరించి వాటి ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో హోంసైన్స్ విభాగాధిపతి సోని, డాక్టర్ లక్ష్మీప్రభ, పి.కె.జయలక్ష్మి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ చాంపియన్‌షిప్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఈవెంట్ నిర్వాహకుడు వీరు మామ, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్, రెసో వైజాగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అతి పెద్ద స్కూల్ చాంపియన్‌షిప్ ఈవెంట్ విజయవంతం కావాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆకాంక్షించారు. బుధవారం తన కార్యాలయంలో రెసో వైజాగ్ ఈవెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇలాంటి ఈవెంట్స్ చక్కటి స్ఫూర్తినిస్తాయని అభినందనలు తెలిపారు. ఎల్‌కేజీ నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న పిల్లలకు జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో డ్రాయింగ్ (స్వచ్ఛభారత్), టాప్ స్పీకర్, పాప్, ఫోక్ సింగింగ్, వెస్ట్రన్ డ్యాన్స్, రైమ్స్, క్రియేటివ్ డ్రెస్ వంటి అంశాలుంటాయి. ఆడిషన్స్ ఆగస్టు 17,18 తేదీల్లో జరగనున్నాయి. మెగా ఫైనల్ సెప్టెంబర్ 1న పోర్ట్ స్టేడియం విశ్వనాథ్ కన్వెన్షన్‌లో జరుగుతుందని, మరిన్ని వివరాలకు 7989860680లో సంప్రదించాలని వీరుమామ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



డాబాగార్డెన్స్‌లో పట్టుకున్న పీడీఎస్ బియ్యం

మహారాణిపేట: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)కు చెందిన బియ్యాన్ని బుధవారం పౌర సరఫరాల శాఖాధికారులు పట్టుకున్నారు. డీఎస్‌వో సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేపట్టారు. డాబాగార్డెన్‌లో అనధికారికంగా ఓ వాహనంలో రవాణా చేస్తున్న పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. అగనంపూడి, పెదమాదక ప్రాంతాల్లో నిల్వ ఉంచిన 400 కిలోలను, తగరపువలసలో అక్రమంగా నిల్వ ఉంచిన 300 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు మొత్తం 4,700 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్‌వో సూర్యప్రకాశరావు తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాలను కూడా సీజ్ చేశామన్నారు.

విద్యార్థులు ఇష్టంగా తినేలా 'మధ్యాహ్న భోజనం'



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాలతో విద్యార్థులు ఇష్టంగా తినేలా ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం అమలుపై విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్టీరింగ్, పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం అమలులో రైస్ మినహా, మిగిలిన మెనూ అంతా బాగుందని తెలిపారు. బియ్యం బాగా లేకపోతే వాటిని తిప్పి పంపాలని కలెక్టర్ సూచించారు. మధ్యాహ్న భోజనం కోసమే బడికి వచ్చే విద్యార్థులు చాలా మంది ఉన్నారని, ఇటువంటి పరిస్థితిలో పిల్లలు ఇష్టపడి తినేలా పదార్థాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఈ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి ఎంపీడీవో తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు పారిశుద్ధ్యం పనులు పరిశీలించాలని జెడ్పీ సీఈవోకు సూచించారు. యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థుల వివరాలను ఆర్‌బీఎస్ నోడల్ అధికారికి తెలియజేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో 584 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిలో 61,228 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఎం.శోభారాణి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న మేయర్



ఓటు హక్కు వినియోగించుకుంటున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల్లో పోటీ చేసిన 20 మందిలో 10 మంది గెలుపొందారని ఎన్నికల అధికారి, జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు జరిగాయని, ఈ ఎన్నికల్లో 97 మంది కార్పొరేటర్లకుగాను 96 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. వీరిలో విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాలశ్రీనివాసరావు, టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత, జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్ ఉన్నారని తెలిపారు. పోలింగ్ పూర్తయిన అనంతరం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టారు.

చేనేత కళాకారులకు సన్మానం



చేనేత కళాకారులతో కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన చేనేత కళాకారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆత్మీయంగా సత్కరించారు. చేనేత, జౌళీ శాఖ అధికారులతో కలిసి కళాకారులు ఎ.అప్పల సూర్యారావు, ఎన్.భోగేశ్వరరావు, కె.చినబాబు బుధవారం కలెక్టర్‌ను అతని చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారికి కలెక్టర్ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి.. ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం కళాకారులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపి.. చేనేత వస్త్రాలతో సన్మానించారు. చేనేత, జౌళీ శాఖ ఏడీ వి.పద్మ, డెవలప్‌మెంట్ ఆఫీసర్ సునీల్ కుమార్ బుడితి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రాంగణంలో ఆప్కో స్టాల్

కలెక్టరేట్ ప్రాంగణంలో ఆప్కో ఆధ్వర్యంలో చేనేత వస్త్రాల ప్రదర్శన, విక్రయాల కోసం ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు ఏడీ పద్మ తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

టీబీ వ్యాధిపై వైద్య సిబ్బంది అవగాహన



టీబీపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌వీ రత్నం, ఆశ వర్కర్ లీలావతి



అడల్ట్ బీసీజీపై అవగాహన కల్పిస్తున్న ఆశ వర్కర్ లీలావతి

అల్లిపురం: క్షయ వైరల్ ఇన్‌ఫెక్షన్ వల్ల వ్యాప్తి చెందుతుందని, ఇది సాధారణంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందని, దగ్గు, తుమ్మడం, ఉమ్మి వేయడం ద్వారా గాలిలో వ్యాపిస్తుందని హెచ్‌వీ రత్నం వివరించారు. బుధవారం ఆమె ఆశ వర్కర్ లీలావతితో కలిసి వెంకటేశ్వరమెట్ట, మిరపకాయల వీధిలో ఇంటింటికి వెళ్లి క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. మైకోబ్యాక్టీరియం ట్యూబర్ క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా కారణంగా టీబీ వస్తుందని, దీని వల్ల ఊపిరితిత్తులను ప్రభావితం చేయడమే కాకుండా ఒక్కోసారి మూత్రపిండాలు, వెన్నెముక, మెదడు, గర్భాశయం వంటి కీలక అవయవాలను కూడా దెబ్బతీస్తుందని వివరించారు. టీబీ నిరారణకు తెమడ పరీక్ష, ఛాతీ ఎక్స్‌రేతో పాటు పలు పరీక్షలు చేస్తారన్నారు. టీబీకి సంపూర్ణ వైద్యం అందుబాటులో ఉందన్నారు. డాక్టర్ పర్యవేక్షణలో కనీసం 6 నెలల పాటు మందులు వాడితే టీబీని నివారించవచ్చన్నారు. అనుమానం ఉన్నవారి నుంచి వారు తెమడ (ఉమ్మి) సేకరించారు.

అడల్ట్ బీసీజీ టీకాలు వేసుకోండి..

షుగర్ ఉన్నవారు, 60 సంవత్సరాలు దాటిన వారు తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అడల్ట్ బీసీజీ టీకాలు వేసుకోవాలని ఆశ వర్కర్ లీలావతి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా బీసీజీ టీకాలు వేస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఫొగాట్ అనర్హతపై వాస్తవాలు వెల్లడించాలి

మహారాణిపేట: ఒలింపిక్ క్రీడల్లో మహిళా మల్లయోధుల విభాగంలో ఫైనల్ రౌండ్‌కి చేరిన వినేష్ ఫొగాట్‌ను ఎందుకు అనర్హురాలిగా ప్రకటించారో బహిర్గతపరచాలని ప్రగతి శీల మహిళా సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, తెలంగాణ ప్రతినిధి ఝాన్సీ, ఢిల్లీ ప్రతినిధి పూనం కౌశిక్ భారత్ ఒలింపిక్ అధికారులను డిమాండ్ చేశారు. ఒలింపిక్ క్రీడల్లో ఫైనల్ రౌండ్‌కి చేరి మొట్ట మొదటిసారి బంగారు పతకానికి చేరువైన సమయంలో 100 గ్రాముల అధిక బరువు కలిగి ఉందనే కారణంతో ఒలింపిక్ క్రీడల నుంచి వినేష్ ఫొగాట్‌ను అనర్హురాలిగా ప్రకటించడాన్ని కుట్రపూరితమైన చర్యగా వారు అభివర్ణించారు. మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్‌భూషణ్ నేర స్వభావాన్ని బట్టబయలు చేసి, అతనిపై క్రిమినల్ కేసులు నమోదయ్యే వరకు విరామం లేకుండా పోరాడిన ఆమెపై కక్ష గట్టి ఈ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలతో తనకున్న సన్నిహిత సంబంధాలతో ఇలా చేయించినట్లు మహిళా సంఘాలు భావిస్తున్నాయన్నారు. ఈ విషయంపై భారత ఒలింపిక్ అధికారులు వాస్తవాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



టౌన్‌సర్వీస్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: ప్రజలకు అందించే తాగునీరు కలుషితం కాకుండా, నిత్యం నీటి తనిఖీలు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మంచినీటి విభాగం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టౌన్‌సర్వీస్ రిజర్వాయర్(టీఎస్ఆర్)ను బుధవారం సందర్శించి జలాశయాల నుంచి నగర ప్రజలకు సరఫరా చేస్తున్న తాగు నీటి సరఫరా ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు కలుషితం కాకుండా, సురక్షిత తాగునీటిని అందించాలని, ఆ దిశగా అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్ రవిని ఆదేశించారు. నగరానికి ఎన్ని జలాశయాల నుంచి నీటి సరఫరా జరుగుతుంది? ఎన్ని రిజర్వాయర్లు ఈఎల్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్ ట్యాంకులున్నాయని ఆరా తీశారు. నగరంలో ఏడు జలాశయాల నుంచి నగరానికి నిత్యం 388 ఎంఎల్‌డీ నీటిని శుద్ధి ప్లాంట్ల ద్వారా నీటి సరఫరా అవుతుందని, 48 మినీ రిజర్వాయర్లు, 100 ఈఎల్ఎస్ఆర్, 146 జీఎల్ఎస్ఆర్ ట్యాంకులు ఉన్నాయని, వీటి ద్వారా నాణ్యమైన నీటిని నిత్యం ప్రజలకు అందించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. అంతేకాక సచివాలయాల పరిధిలో 2500 నీటి నాణ్యత పరీక్షలు నిత్యం జరుపుతూ ప్రజలకు ఉదయం 4.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ప్రాంతాల వారీగా రోజూ 45 నిమిషాల నుంచి ఒక గంట సమయం పాటు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నట్లు వివరించారు. వంద రోజుల ప్రణాళిక, స్టాప్ డయేరియా కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు మంచినీటిని అందించాలని, కాల్వలు, కల్వర్టుల్లో ఉన్న తాగు నీటి పైపులైన్ లీకులను అరికట్టి, వాటి వద్ద నీరు కలుషితం కాకుండా మార్పు చేసి త్వరితగతిన అమర్చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టీఎస్ఆర్‌లో గల పంప్‌హౌస్‌ను పరిశీలించి విద్యుత్ వినియోగం తగ్గించేలా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజినీరు కేవీఎన్ రవిని కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహక ఇంజినీరు శేఖర్, ఉపకార్య నిర్వహక ఇంజినీరు సతీష్, సహాయక ఇంజినీరు ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పశు గణనకు అధికారులు సిద్ధంగా ఉండాలి

ఆరిలోవ: పశు గణన కోసం పశు సంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. పశు గణనకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం డెయిరీ ఫారం వద్ద జిల్లా పశు సంవర్ధక శాఖ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. జిల్లా నోడల్ అధికారి మాదిన ప్రసాదరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి ఇంటిలోను పశువులు, కోళ్లు, తదితర వాటిని ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ సందర్భంగా ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లతో కలసి జేడీ డాక్టర్ రామకృష్ణ పశు గణనకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 21వ అఖిల భారత పశు గణన ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభంకానుందన్నారు. పశు గణనకు జిల్లాలో 130 మంది ఎన్యుమరేటర్లు, 25 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. వారికి పూర్తి స్థాయి శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. సిబ్బంది నిబద్ధతతో గణన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రామ్మోహన్, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రవికుమార్, డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.